క్లుప్తంగా

నేడు శివాలయాల్లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

డోన్ : పట్టణ అర్చక పురోహిత సంఘం ఆధ్వర్యంలో జనహితం కోసం ఈనెల 4న అన్ని శివాలయాల్లో స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చక సంఘం అధ్యక్షుడు కళ్లే శేషావలి శర్మ తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురువాలని, పాడి పంటలతో రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షతో పట్టణంలోని 15 శివాలయాల్లో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు తరలివచ్చి స్వామివారికృప పొందాలని కోరారు.

ఘనంగా లింగావధూత స్వామి ఆరాధనోత్సవం


పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న శ్రీపూదోట లింగావధూత స్వామి ఆరాధన మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మఠం కమిటీ సభ్యులు, భక్త మండలి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అవధూతస్వామికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రాష్ట్ర మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలిగా మనోరమ



ప్యాపిలి: ఎరుకల సంఘం రాష్ట్ర మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలిగా మనోరమ ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఏపీ ఎరుకల సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస చక్రవర్తి ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్యాధికారి ఎల్లప్ప సతీమణి మనోరమ ఎరుకుల హక్కుల కోసం విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపిన మనోరమ ఎరుకల జాతి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీధర్



డోన్ : డోన్ పట్టణ డాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవరాన్ని బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేవీ శ్రీధర్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ రాజశేఖర్, కార్యదర్శిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా డాక్టర్ భార్గవ్ రెడ్డి, కోశాధికారిగా ముష్కిన్‌వలిని ఎన్నుకున్నారు. అదేవిధంగా సభ్యులుగా డాక్టర్ రేవతి, డాక్టర్ దీపిక, డాక్టర్ కుసుమకుమారి, డాక్టర్ సౌమ్య, డాక్టర్ మధురామక్రిష్ణను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ


విద్యార్థులకు స్టూడెంట్ కిట్ అందజేస్తున్న దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని మెట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్టూడెంట్ కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవీంద్ర గుప్త మాట్లాడుతూ స్టూడెంట్ కిట్‌లో విద్యార్థులకు అవసరమైన బ్యాగ్, పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టు కూడా ఉంటాయన్నారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నపరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులో మార్పులు

డోన్ టౌన్ : రిజర్వ్ బ్యాంక్ సూచనల మేరకు విద్యుత్ బిల్లుల చెల్లింపులలో మార్పులు చేశామని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ ఎస్పీడీసీఎల్ యాప్, ఏపీఎస్పీ డీసీఎల్ సైట్, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు, వ్యాలెట్ క్యాష్ కార్డుల ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించవచ్చన్నారు. గతంలో మాదిరి ఫోన్‌పే, గూగుల్‌పే తదితరాల ద్వారా చెల్లింపులు చేయొద్దని సూచించారు.

అర్థమయ్యేలా బోధించండి

బేతంచెర్ల: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంఈఓ సోమశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం పట్టణంలోని హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూల్‌ను ఎంఈఓ తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించడంతపాటు అదనపు తరగతి గదుల నిర్మాణాల పురోగతిపై హెచ్‌ఎం రాజశేఖర్‌తో చర్చించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు.

పెంపుడు జంతువులుంటే... జరభద్రం!

- జూనోటిక్ వ్యాధులు సోకే ప్రమాదం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- 6న ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



డోన్ : మనిషికి సోకే వ్యాధులు కోకొల్లలు. ఏ వ్యాధి ఎప్పుడు మనిషి ఆరోగ్యాన్ని కాటేస్తుందో అర్థమవ్వని పరిస్థితి. చివరకు పశుపక్షాదుల నుంచి సుమారు 180 రోగాలు మనుషులకు సంక్రమించే ప్రమాదం ఉంది. జంతువుల పెంపకం మంచిదే... అయితే జరభద్రం అంటున్నారు పశువైద్య నిపుణులు. పశుపక్షాదులతో నిత్యం మెలిగే పశువైద్యులు, రైతులు, జంతువధశాల కార్మికులు జంతు ప్రేమికులకు జూనోటిక్/జూనోసిస్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఈ వ్యాధులు సంక్రమించకుండా ప్రజలను అప్రమత్తం చేయడం కోసమే ప్రతి ఏటా 6వ తేదీన జూనోసిస్ డేగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవడం ఆనవాయితీ. కుక్క కాటుకు బారిన పడిన ఓ బాలుడికి టీకా మందు ఇచ్చి బతికించిన రోజు జూలై 6 కావడంతో ఇదేరోజున ప్రపంచ వ్యాప్తంగా జూనోసిస్ దినోత్సవంగా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాగరాజు తెలిపారు.

5.70లక్షల యాంటి రేబిస్ టీకాలు సిద్ధం

పశువైద్యశాలలు,ప్రాంతీయ వెటర్నటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లలో జూనోటిక్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం జూలై 6వ తేదీన ఉచితంగా టీకాలు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 5.70లక్షల యాంటి రేబిస్ టీకాలు సిద్ధం చేసింది అధికారయంత్రాంగం. పశుపక్షాదుల నుంచి సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు చికిత్సల గురించి, వేయాల్సిన టీకాల గురించి పెంపకందారులు, రైతులకు తెలియజేసేందుకు రైతుసేవా కేంద్రాలు, పశువైద్యశాలల్లో సిబ్బంది వివరిస్తున్నారు.

జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులు

పశుపక్షాదుల పెంపకందారులు, జంతు పక్షులను వధించే వారికి ప్రధానంగా రేబిస్, మెదడువాపు వ్యాధి, హైపటైటిస్, పాక్స్, డెంగీ ఫివర్, కొక్కర తెగులు వైరస్ మొదలైన వ్యాధులు సంభవించే అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఇందులో అత్యంత ప్రమాదకరమైనది రేబిస్ వ్యాధి అని పశువైద్యులు నిర్ధారించారు. ప్రాణాంతకమైన ఈ వ్యాధి నివారణ కోసం జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జూలై 6న విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించేందుకు పశువైద్యశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

"వ్యాధులు సంక్రమించకుండా టీకాలు



జూనోటిక్ వ్యాధులతో మానవాళి మనుగడకు ఎలాంటి ప్రమాదం సంభవించకుండా పశుసవర్ధక శాఖ తరపున చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఏటా జూనోసిస్ దినోత్సవాన్ని జూలై 6న జరుపుకోవడం ఆనవాయితీ. వ్యాధుల పట్ల మరిన్ని సలహాలు సంప్రదించడం కోసం ప్రభుత్వం 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేసింది. ముఖ్యంగా రేబిస్ వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ తమ పెంపుడు జంతువులైన కుక్కలకు టీకాలు వేయించాలి.

–డాక్టర్ నాగరాజు,
పశువైద్య సహాయ సంచాలకులు, డోన్.

కుక్క యాజమానిపై చర్యలు తీసుకోవాలి

బేతంచెర్ల: తన కుమార్తెను గాయపరిచిన కుక్క యజమానిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపాన నివాసం ఉంటున్న సారమ్మ బుధవారం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఐదురోజుల క్రితం సారమ్మ కుమార్తె పదేళ్ల పవిత్ర స్కూలుకు వెళ్లే క్రమంలో స్నానం చేసేందుకు ఇంటి ఆవరణలో నీళ్లు తోడుకుంటుంది. అయితే ఎదురుగా నివాసం ఉంటున్న కొలుట్ల రమేష్, అతని కుమారుడు వీరకుమార్ తమ కుక్కను బయటకు వదిలారు. అటుగా వెళ్లిన కుక్క నీళ్లుతోడుకుంటున్న పవిత్రను కరవడంతో ఆ చిన్నారి అపస్మారక స్థితికి వెళ్లింది. తన కుమార్తెపై కుక్క దాడికి పాల్పడుతున్నా పట్టించుకోని కొలుట్ల రమేష్, అతని కుమారుడు వీర కుమార్‌పై చర్యలు తీసుకోవాలని సారమ్మ పోలీసులను కోరారు.

సెలవులో ఎంపీడీఓ

కొలిమిగుండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సాయికృష్ణ బుధవారం నుంచి మూడు నెలల పాటు సెలవు తీసుకున్నారు. గ్రూప్–1 పరీక్షల ప్రిపరేషన్ కోసం సెలవు తీసుకున్నట్లు తెలుస్తుంది. ఏఓగా పని చేస్తున్న ప్రసాదరెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తారని సమాచారం.

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్ రద్దు


సమావేశం నిర్వహిస్తున్న ఏడీఏ సుధాకర్

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని, నకిలీవి అమ్మితే ఆ షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఏడీఏ సుధాకర్ హెచ్చరించారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో బుధవారం కోవెలకుంట్ల మండలంలోని విత్తన, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసిన రైతులకు డీలర్లు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయాలు జరపాలని, అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ నిరంజన్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి


నూతన కమిటీ సభ్యులతో సంఘీ భావం తెలుపుతున్న ఉద్యోగులు

డోన్ టౌన్ : పద్దెనిమిది నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ సంఘం జిల్లా అధక్షుడు నాగేశ్వరరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కొచ్చెర్వు గ్రామ సమీపంలోని అడ్డరోడ్డు సమీపాన డోన్, ప్యాపలి మండలాల ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పకృతి వ్యవసాయ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాద బీమా, ఈఎస్‌ఐ, పీఎఫ్ తదితర కల్పించాలని కోరారు. అనంతరం డోన్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా శివరామ్, అధ్యక్షునిగా మనోహర్, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, పరమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రఘురామయ్య, సహాయ కార్యదర్శులుగా తిరుమలి, రవి, కోశాధికారిగా శ్రీదేవిని ఎన్నుకున్నారు.

టైపు రైటర్ల సమస్యలను పరిష్కరించాలి


ఎమ్మెల్యే కోట్లకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీరాములు

డోన్ టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డికి టైపు రైటింగ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ అధక్షుడు శ్రీరాములు వినతి పత్రం అందజేశారు. వృత్తి పరంగా టైపు రైటర్లు సమస్యలు ఎదుర్కొంటున్నామని, తమిళనాడు తీరులో జూనియర్,లోయర్,హైయ్యర్,షార్ట్ హ్యాండ్ తదితర గ్రేడులను అమలు చేయాలని విన్నవించారు. సమస్యను ఐటీ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుల్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం


అన్నం వడ్డిస్తున్న సభ్యులు

డోన్ టౌన్ : భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని పురష్కరించుకొని బుధవారం వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో డోన్ డివిజన్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రోగులతోపాటు సహాయకులకు కమిటీ సభ్యులు స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఆదాం, ఉపాధక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి జాన్సన్‌బాబు, సభ్యులు పవన్‌కుమార్, జాషువా, సుధాకర్, ఉదయ్, మణికంఠ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి


నివాళులర్పిస్తున్న ఎంపీపీ బుగ్గన,చైర్మన్ చలం రెడ్డి

బేతంచెర్ల: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మోడరన్ మగ్బుల్ (62) కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, ఇబ్రహీం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు రుద్రవరం నారాయణ, గూని నాగరాజు, అజామ్ మగ్బుల్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నంద్యాలకు చెందిన శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఈఓ గోపీనాథ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రి చెందిన వైద్య నిపుణులు రోగులకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, టుడీఎకో తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారన్నారు. పట్టణం ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యా, వసతిదీవెన నిధులు విడుదల చేయాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

బనగానపల్లె రూరల్ : విద్యా, వసతి దీవెనల పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్, సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 8, 9,10వ తేదీల్లో కాకినాడలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతుల పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కాకినాడలో మూడు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులకు విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ధనుంజయుడు, నాయకులు రాజేష్, జయశేఖర్, వేణు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలుదారు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: ఖరీఫ్ సీజనలో కౌలుకు పొలం తీసుకొని సాగు చేస్తున్న రైతులు కౌలు పత్రాలు పొందడానికి రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వోను సంప్రదించాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన కల్పించారు. కౌలు పత్రాలు పొందడం ద్వారా బ్యాంక్‌లో పంట రుణాలు, బీమా, పంటలను మద్దతు ధరకు అమ్ముకోవచ్చని ఏఓ సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ బెన్నీ రాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ యశోద, భారతి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచండి

- ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోండి
- మహిళా సంరక్షణ కార్యదర్శులతో సీఐ గంటా సుబ్బారావు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె రూరల్ : అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని సచివాలయాల్లో విధులు నిర్వహించే మహిళా సంరక్షణ కార్యదర్శులకు బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు సూచించారు. స్థానిక అర్బన్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం మండలంలోని మహిళా సంరక్షణ కార్యదర్శులతో సీఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల శిలాఫలకాలు, రాజకీయ నాయకుల విగ్రహాల ధ్వంసం లాంటి సంఘటనలు అక్కడక్కడ జరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కొందరు అకతాయిల మూలంగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, అలాంటి వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుని ఎక్కడా ఆస్తి నష్టం జరగకుండా మహిళా సంరక్షణ కార్యదర్శులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా నేరమన్నారు. ఎంతటివారైనా ఉపేక్షించమనే, కేసులు నమోదు చేస్తామనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఏ మాత్రం అనుమానాలున్నా ముందస్తుగా తమకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి


వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె : పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని సీఐ గంటా సుబ్బారావు కోరారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా బుధవారం జీఎం టాకీస్ నుంచి సర్కిల్ కార్యాలయం, పాత బస్టాండ్ మీదుగా పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు రహదారిని సీఐ పరిశీలించారు. రహదారి వెంటా ఉన్న వ్యాపార సముదాయాలు, వాహనాల పార్కింగ్‌ను గమనించిన సీఐ వ్యాపారులతో మాట్లాడారు. రోడ్డుకు రెండు వైపులా వాహనాలు నిలపడం మూలంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందనే విషయాన్ని వ్యాపారులతో పాటు వాహనచోదకులు, ప్రజలు గమనించాలని సీఐ సూచించారు. ప్రజలకు, ప్రజాప్రతినిధుల వాహనాలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బంది కలిగించకుండా ఉండేందుకు షాపింగ్‌కు వచ్చే వాహనదారులు నిబంధనలు పాటించాలన్నారు. ఓ వారం రోడ్డుకు కుడివైపున, మరోవారం ఎడమ వైపున వాహనాలు ఉంచితే ట్రాఫిక్ సమస్య దాదాపు తలెత్తదన్నారు. వాహనచోదకులు ఈ నిబంధనలు పాటించేలా వ్యాపారులు చర్యలు తీసుకోవాలని సీఐ సూచించగా వారు సమ్మతించారు.

కేబుల్ అపహరణ

ప్యాపిలి: మండల పరిధిలోని రామరత్నగిరి వద్ద తోటలు, పొలాల్లో మోటార్లకు ఏర్పాటు చేసుకున్న కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. రైతులు జమాల్ బాషా, రవికుమార్, వెంకట రమణయ్య, నాగేశ్వరరావుతో పాటు మరో ఐదు మంది రైతుల తోటల్లో కేబుల్ చోరీకి గురైంది. దాదాపు 180 మీటర్ల కేబుల్ చోరీకి గురైందని, గతంలోనూ పొలాల్లోని కేబుల్‌ను దుండగులు అపహరించినట్లు బాధితులు వాపోయారు. ఈ మేరకు వారు జలదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

పండ్ల మొక్కలు నాటుకోవాలి

బేతంచెర్ల: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు అనుమతి ఉంటే గుంతలు తవ్వుకొని మొక్కలు నాటుకోవాలని ఎంపీడీఓ రవి ప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్స్‌తో ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంకా ఎవరైనా రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకు వస్తే దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు సూచించారు. అలాగే ఉపాధి పనుల పురోగతిపై చర్చించారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా చంద్రమ్మ

కోవెలకుంట్ల: ఐసీడీఎస్ కోవెలకుంట్ల మండలం సెక్టార్ 1 సూపర్‌వైజర్‌గా చంద్రమ్మకు అదనపు బాధ్య తలు అప్పగించినట్లు ఆ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. సూపర్‌వైజర్ గీతా లక్ష్మి గత నెల 30న పదవీ విరమణ చేశారని, ఆ స్థానంలో అదే మండలంలోని సెక్టార్ 2 సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న చంద్రమ్మను ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యా సంస్థల బంద్


మాట్లాడుతున్న ఏఐఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజేయుడు


కరపత్రాలను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కోవెలకుంట్ల: నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గురువారం నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు మాబు ఉసేన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం... కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు షాషావలి, ప్రవీణ్, గణేష్, పెద్ద ఓబులేసు, లోహిత్, దస్తగిరి, బాషా, ఉసేన్‌బాషా, రహీం తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : ఈ నెల 4న దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్ కార్యక్రమం విజయవంతం చేయాలని ఏఐఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు ధనుంజేయుడు పిలుపు ఇచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎఫ్ నాయకులు, విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయస్థాయి పరీక్షలు నిర్వహించడంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) విఫలమైందన్నారు. నీట్ పరీక్ష లీకేజీ వెనుక కుంభకోణం ఉందని ఆరోపించారు. దేశంలో విద్య, ప్రజాస్వామ్యంపై దాడికి వ్యతిరేకంగా ఈ నెల 4న దేశ వ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యాదర్శి ఎర్రి స్వామి, స్థానిక నాయకులు కిరణ్‌సాయి, బాలు, కిరణ్, రఫీ, బన్నీ, హరి, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

డోన్ టౌన్ : విద్యారంగ పరిరక్షణకు గురువారం తల పెట్టిన విద్యా సంస్థల బంద్‌లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధక్షుడు పవన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రంగస్వామి పిలుపునిచ్చారు. బంద్‌పై పట్టణంలో బుధవారం సంయుక్త సమావేశం నిర్వహించుకోని పాటించ వలసిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో ఎన్టీఏ విఫలం అయ్యిందన్నారు. నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మహానందిలో అంతర్గత బదిలీలకు రంగం సిద్ధం !

మహానంది: మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఏజేన్సీ ఉద్యోగుల విధుల మార్పునకు అధికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి బదిలీపై వెళ్లిన నేపథ్యంలో నూతన ఈఓ (ఎఫ్ఏసీ)గా కోటప్పకొండ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తాజాగా ఉద్యోగుల అంతర్గత బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి, కోదండరామాలయం, ప్రసాదాల(పడితరం)విభాగం, ఇతర స్థానాల్లో ఉన్నవారిని మార్చేందుకు చర్చలు చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో మార్పులు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: మహానంది ఆలయంలో బుధవారం భక్తులసందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం మహానందీశ్వరస్వామి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు అష్టవిధ మహామంగళ హారతులు, స్థానిక అభిషేకార్చనలు చేపట్టారు.